క్లుప్తంగా

అదనపు కలెక్టర్‌కు వినతి

నాగర్‌కర్నూల్‌రూరల్: కలెక్టరేట్ సమీకృత కార్యాలయ భవనంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి కనీస వేతనాలు అమలు చేయాలని కోరుతూ బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ సీతారామరావుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి ఆర్ శ్రీనివాసులు మాట్లాడుతూ ఔట్ సోర్సింగ్ సిబ్బందికి కనీస వేతనాలు అమలు చేయడంలో వివక్షత చూపుతున్నారని వివరించారు. స్వీపర్లకు, కార్మికులకు రూ.7వేల వేతనం ఏ మాత్రం సరిపోవడం లేదని పేర్కొన్నారు. కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఔట్‌సోర్సింగ్‌సిబ్బంది అలివేలమ్మ, భాగ్యమ్మ, కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



కల్వకుర్తిరూరల్: గ్రామాల నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎంపీడీఓ ఆంజనేయులు అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సర్పంచ్‌లు పదవీకాలం ముగియనుండటంతో అధికారులు ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరించాలని సూచించారు. ప్రతి గ్రామానికి ప్రత్యేకాధికారిని నియమిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ దేవేందర్, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

16న సార్వత్రిక సమ్మె



నాగర్‌కర్నూల్‌రూరల్: దేశవ్యాప్తంగా ఈ నెల 16న సార్వత్రిక సమ్మె నిర్వహిస్తునట్లు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు వర్దం పర్వతాలు అన్నారు. ఈ మేరకు బుధవారం సివిల్ సప్లయ్ సీనియర్ అధికారి డీఎం బాలరాజుకు సమ్మె నోటీసు పత్రాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తోందన్నారు. కార్యక్రమంలో హమాలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి బాలయ్య, నరేందర్, సాయిలు, గోపాల్, శివ, పవన్ తదితరులు పాల్గొన్నారు.

ఉజ్వల పథకానికి దరఖాస్తు చేసుకోవాలి

కందనూలు: ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకానికి దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సివిల్ సప్లై అధికారి స్వామి కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో వంట గ్యాస్ కనెక్షన్ లేని తెల్లరేషన్ కార్డుదారులు అర్హులని పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా తక్కువ ఆదాయ వర్గాలకు చెందిన మహిళలు కూడా ఎల్పీజీ సిలిండర్ ప్రయోజనం పొందవచ్చని వివరించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో దారిద్ర్యరేఖకు దిగువన నివసిస్తున్న మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు సమావేశ మందిరం ప్రారంభం

తాడూరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ సముదాయ ఆవరణలో రూ.30 లక్షల వ్యయంతో నిర్మించిన సమావేశ భవన నిర్మాణాన్ని గురువారం ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి ప్రారంభిస్తారని ఎంపీపీ శ్రీదేవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అదే విధంగా మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల సర్పంచ్‌ల పదవీ కాలం పూర్తి కానున్న సందర్భంగా ఆత్మీయ వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు అధికారులు హాజరుకావాలని ఆమె కోరారు.

మైనారిటీ మండల అధ్యక్షుడిగా కుర్షిద్

తెలకపల్లి: కాంగ్రెస్ పార్టీ ముస్లిం మైనారిటీ సెల్ మండల అధ్యక్షుడిగా కుర్షిద్ ఎంపికపై మండల కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు హబీబ్ నియామకపత్రాన్ని అందించినట్లు ఆయన పేర్కొన్నారు. సింగిల్‌విండో వైస్ చైర్మన్ మామిళ్లపల్లి యాదయ్య, గౌరెడ్డిపల్లి మాజీ సర్పంచ్ బాలగౌడ్‌లు కుర్షిద్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్

బల్మూర్: విద్యతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఎంఈఓ రామారావు అన్నారు. స్థానిక కస్తూర్బాగాంధీ విద్యాలయంలో బుధవారం ఇంటర్, పదో తరగతి విద్యార్థినులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ప్రభుత్వం పేద విద్యార్థుల కోసం ప్రవేశపెడుతున్న విద్య పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎస్ఓ లలిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో సర్పంచ్‌లే కీలకం



కొల్లాపూర్‌లో



పెంట్లవెల్లిలో..



పెద్దకొత్తపల్లిలో సర్పంచ్‌లను సన్మానిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

పెద్దకొత్తపల్లి: గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్‌లు కీలక పాత్ర అని రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో పదవీకాలం ముగుస్తున్న సర్పంచ్‌లను బుధవారం పూలమాల, శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి సర్పంచ్‌లు ఎంతో కష్టపడ్డారన్నారు. వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్, జెడ్పీటీసీ మేకల గౌరమ్మ, సర్పంచ్‌లు సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, ఎంపీటీసీలు శశికళ రవికుమార్, కొండలయ్య, సర్పంచ్‌లు సత్యం, రమేశ్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి, రాధా, చిన్నయ్య, ఎంపీడీఓ కృష్ణయ్య పాల్గొన్నారు.

కొల్లాపూర్: మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సర్పంచ్‌లకు బుధవారం సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఎంపీపీ బోజ్యానాయక్, జెడ్పీటీసీ జూపల్లి భాగ్యమ్మ, ఎంపీడీఓ చెన్నమ్మలు సర్పంచ్‌లను శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. అధికారులకు సర్పంచ్‌లు కృతజ్ఞతలు తెలిపారు.

లింగాల: గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు, వార్డు సభ్యుల పదవీ కాలం ముగిసిన సందర్భంగా నాయకులు, గ్రామస్తులు వారిని సన్మానించారు. మండలంలోని లింగాల మేజర్ గ్రామ పంచాయతీ పాలక వర్గానికి, మండలంలోని పలు గ్రామ పంచాయతీల పాలక వర్గాలకు ప్రజలు సాదారంగా వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ మాకం తిర్పతయ్య, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు కేటీ తిర్పతయ్య, హెచ్‌ఎం అంజిలాల్, పంచాయతీల కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

పెంట్లవెల్లి: గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ సువర్ణమ్మరామన్‌గౌడ్‌తో పాటు, వార్డు సభ్యులను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రామన్‌గౌడ్, సెక్రెటరీ సాధిక్, కబీర్, మౌలాలీ, వార్డు సభ్యులు కుమార్, రవి, రమణ తదితరులు పాల్గొన్నారు.

చారకొండ: స్థానిక సర్పంచ్ గుండె విజేందర్ గౌడ్, మర్రిపల్లి సర్పంచ్ నరేష్ నాయక్, చంద్రాయన్‌పల్లి సర్పంచ్ వసంత లను ఆయా గ్రామాల్లో సన్మానించారు.

వెల్దండ: సర్పంచ్ పదవీ వీడ్కోలు సమావేశాన్ని బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ భూపతిరెడ్డితో పాటు వార్డు సభ్యులను గ్రామస్తులు, నాయకులు సన్మానించారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ ఐదేళ్లుగా గ్రామస్తుల సహకారంతో గ్రామాన్ని అన్ని విధాల అభివృద్ధి చేశానన్నారు. సహకరించిన నాయకులకు, అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు బచ్చు రామకృష్ణ, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, రషీద్, ఎర్రశ్రీనుముదిరాజ్, మల్లేష్‌ముదిరాజ్, కృష్ణముదిరాజ్ తదితరులు ఉన్నారు.

ఆలయ చైర్మన్ ప్రమాణస్వీకారం

పెద్దకొత్తపల్లి: నాయినోనిపల్లి మైసమ్మ దేవత ఆలయ చైర్మన్‌గా శ్రీనివాసులు బుధవారం ప్రమాణస్వీకారం చేశారు. ముఖ్య అతిథిగా మంత్రి జూపల్లి కృష్ణారావు హాజరయ్యారు. ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్, జెడ్పీటీసీ మేకల గౌరమ్మ, ఎండోమెంట్ డివిజన్ అధికారి వెంకటేశ్వరీ, మైసమ్మ దేవత ఈఓ రంగారావు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

కొల్లాపూర్ రూరల్: గ్రామాల అభివృద్ధికి సహకరిస్తానని మంత్రి జూపల్లి కృష్ణారావు హామీ ఇచ్చారు. బుధవారం మండలంలోని కుడికిల్లలో రైతువేదిక, ఎస్సీ కమ్యూనిటీ హాల్ భవనాలను ఆయన జెడ్పీటీసీ సభ్యులు జూపల్లి భాగ్యమ్మ, సర్పంచ్ జ్యోతితో కలిసి మంత్రి ప్రారంభించారు. సింగిల్ విండో చైర్మన్ పెబ్బేటి కృష్ణయ్య, డైరెక్టర్ రఘుపతిరావు, ఏఓ నాగరాజు, కార్యదర్శి అన్వేష్, ఉప సర్పంచ్ రామకృష్ణ, వార్డుమెంబర్లు, నాయకులు, అధికారులు, పాల్గొన్నారు.



లింగాల మండలం కోటికుంటలో



చారకొండలో..



వెల్దండలో

సేవతోనే శాశ్వత గుర్తింపు



ఉప్పునుంతలలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ

ఉప్పునుంతల: సేవతోనే సమాజంలో శాశ్వత గుర్తింపు లభిస్తుందని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. బుధవారం ఎంపీపీ తిప్పర్తి అరుణ అధ్యక్షతన నిర్వహించిన మండల ప్రత్యేక సర్వసభ్య సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. సమావేశానికి హాజరుకాని అధికారులపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు బాధ్యతగా విధులు నిర్వర్తించాలన్నారు. అంతకు ముందు ఆయా శాఖల వారిగా అధికారులు ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. ఆయా గ్రామాల్లో నెలకొన్ని విద్యుత్, వైద్యం, తాగునీరు, పారిశుద్ధ్య సమస్యలను ఆయా గ్రామాల సర్పంచ్‌లు సభ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం పదవీ విరమణ పొందుతున్న సర్పంచులను ఎమ్మెల్యే సన్మానించారు. సమావేశంలో జెడ్పీటీసీ అనంతప్రతాప్‌రెడ్డి, వైఎస్ ఎంపీపీ వెంకటేష్, పీఆర్ డీఈఈ చంద్రకళ, ఎంపీడీఓ లక్ష్మణ్‌రావు, తహసీల్దార్ తబితారాణి, సర్పంచ్‌లు లక్ష్మీనారాయణ, సరిత ఆయా శాఖల అధికారులు, ఎంపీటీసీలు, పాల్గొన్నారు.

చారకొండ: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో గ్రామాలు అభివృద్ధి చెందుతాయని అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఎంపీపీ నిర్మల విజేందర్ గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. ఆయశాఖల వారిగా అభివృద్ధి, వివిధ సమస్యలపై సమీక్షించారు. సమస్యలను ప్రజాప్రతినిధులు సభదృష్టికి తీసుకొచ్చారు. అనంతరం మండలంలోని ఆయా గ్రామాలకు సంబంధించిన 24 మంది కల్యాణలక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే లబ్ధిదారులకు అందజేశారు. సర్పంచ్‌లను ఎమ్మెల్యే సన్మానించారు. వైస్ ఎంపీపీ బక్కమ్మ, సింగిల్ విండో చైర్మన్ గుర్వయ్య గౌడ్, తహసీల్దార్ ప్రమీల, ఎంపీడీఓ వెంకటేష్, ఆయా శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

వంగూరు: నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. బుధవారం రాత్రి మండలంలోని తుమ్మలపల్లి, వంగూరు స్టేజీ వద్ద విద్యుత్ లైట్లను ఆయన ప్రారంభించారు. అంతకు ముందు గాజరలో పర్యటించి అభివృద్ధి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ అల్వాల్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు రాజశేఖర్‌రెడ్డి, పాండురంగారెడ్డి, షేర్‌ఖాన్, హరీష్‌రెడ్డి, నారాయణరెడ్డి, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే పేదల సంక్షేమం



మల్లురవిని సన్మానిస్తున్న ఆశాదీప్‌రెడ్డి

వెల్దండ: కాంగ్రెస్‌తోనే పేదల సంక్షేమం సాధ్యమని ఢిల్లీ అధికార ప్రతినిధి మల్లురవి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డితో కలిసి మాట్లాడారు. ఇంటింటికి గ్యారంటీ పథకాలు అందజేస్తామన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో అధిష్టానం ఎంపీగా అవకాశం కల్పిస్తే పోటీ చేస్తానన్నారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు మల్లురవి, ఎమ్మెల్యేలను ఘనంగా సన్మానించారు. జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ బాలాజీసింగ్, మండల పార్టీ అధ్యక్షుడు మోతిలాల్‌నాయక్, సర్పంచ్ భూపతి రెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్యగౌడు, నాయకుడు రషీద్, పుల్లయ్య, తదితరులు ఉన్నారు.

కల్వకుర్తిరూరల్: ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా నియమితుడు మొదటిసారి కల్వకుర్తికి విచ్చేసిన మాజీ ఎంపీ మల్లురవిని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కాయతి ఆశాదీప్‌రెడ్డి బుధవారం కల్వకుర్తిలో ఘనంగా సన్మానించారు. పూలమాలలు వేసి మల్లు రవిని కాయతి ఆశాదీప్‌రెడ్డి శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

పాఠశాల భవనం ప్రారంభం



నాగర్‌కర్నూల్‌రూరల్: మండలంలోని బొందలపల్లిలో అరవిందో ఫార్మసీ ఫౌండేషన్ డైరెక్టర్ నిత్యానందరెడ్డి, శరత్‌చంద్రారెడ్డి సహకారంతో నిర్మించిన పాఠశాల గదులను బుధవారం జెడ్పీ చైర్‌పర్సన్ శాంతాకుమారి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల సౌకర్యార్థం పాఠశాల గదులను నిర్మించిన దాతలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డితో పాటు ఉపసర్పంచ్ నాగపూర్ మధు, వార్డు సభ్యులు, ప్రజలు, జెడ్పీటీసీ శ్రీశైలం, ఎంపీపీ నర్సింహారెడ్డి, సింగిల్ విండో వైస్ చైర్మన్ నిరంజన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం



అచ్చంపేట రూరల్: గణతంత్ర దినోత్సవం పురస్కరించుకొని ఆయా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో విద్యార్థులకు ఇటీవల ఆటల పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థినీ, విద్యార్థులకు బుధవారం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా జాతీయ నాయకుల జీవిత విశేషాలను ఉపాధ్యాయులు వివరించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

డీఎస్సీలో అవకాశం కల్పించాలి

తెలకపల్లి: ఆర్ట్, క్రాఫ్ట్ టీచర్లకు రాబోయే డీఎస్సీలో అవకాశం కల్పించాలని నాగర్‌కర్నూల్ జిల్లా ఆర్ట్, క్రాఫ్ట్ నిరుద్యోగుల అధ్యక్షుడు పుల్జాల రామస్వామి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీఈఆర్‌టీ నిబంధనల ప్రకారం ప్రతి ప్రభుత్వ పాఠశాలలో క్రాఫ్ట్, ఆర్ట్, మ్యూజిక్ టీచర్ల పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం డీఎస్సీలో అవకాశం కల్పించి పోస్టులను భర్తీ చేయాలని కోరారు.

దివ్యాంగులకు అన్యాయం

నాగర్‌కర్నూల్‌రూరల్: స్టాఫ్‌నర్స్ ఉద్యోగ నియామకాల్లో దివ్యాంగుల అభ్యర్థులకు 4 శాతం రిజర్వేషన్లు అమలు చేయకుండా అన్యాయం చేశారని ఆ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు బుధవారం ఓ పత్రికటనలో తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచించి న్యాయం చేయాలని కోరారు.

టీఎస్‌యూటీఎఫ్ మండల కమిటీ ఎన్నిక



కల్వకుర్తిరూరల్: పట్టణంలోని టీఎస్‌యూటీఎఫ్ భవనంలో జిల్లా అధ్యక్షుడు కృష్ణ సమక్షంలో బుధవారం మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తున్నామన్నారు. నూతన పింఛన్ విధానాన్ని రద్దు చేసి పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. అనంతం కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా పాండయ్య, ప్రధాన కార్యదర్శి నెహ్రూ ప్రసాద్, ఉపాధ్యక్షుడిగా ఎల్లయ్య, శశికళ, కోశాధికారిగా సత్యనారాయణ గౌడ్, ఆంజనేయులు, కల్వకుర్తి ఇన్‌చార్జ్ జిల్లా కార్యదర్శిగా రామేశ్వరయ్యలు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు చిన్నయ్య, శంకర్, జిల్లా కోశాధికారి బాలరాజు, ఆడిట్‌కమిటీ సభ్యుడు వెంకటేశ్వర్లతో పాటు పలువురు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో చోరీ

పెద్దకొత్తపల్లి: మండలంలోని చెన్నపురావుపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో ఈ నెల 24వ తేదీన చోరీ జరిగిందని నిర్వాహకురాలు బుధవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సిలిండర్, పొయ్యి, 50 కేజీల బియ్యం, 300 గుడ్లు, 4 కేజీల పప్పు, 21 నూనె ప్యాకెట్లు ఎత్తుకెళ్లారని ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రాజు తెలిపారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి

కోడేరు: విద్యార్థులకు అర్థమయ్యేలా పాఠాలు బోధించాలని మండల నోడల్ అధికారి నిర్మల అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఎమ్మార్సీ కార్యాలయంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఉపాధ్యాయులకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు.

వాటర్‌ప్లాంట్ ప్రారంభం




పెద్దకొత్తపల్లి: మండలంలోని కొత్తపేటలో కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తాగునీటి శుద్ధి కేంద్రాన్ని సర్పంచ్ కుందేళ్ల పద్మ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ శుద్ధి చేసిన తాగునీటిని తాగాలని గ్రామస్తులకు సూచించారు. అనంతరం ఆ సంస్థ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు కేంద్రాన్ని ఏర్పాటుచేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వెంకటయ్య, ఉపసర్పంచ్ చినస్వామి, కార్యదర్శి శ్రీను, గోపాల్‌రావు, మురళీ, కొండయ్య, కుర్మయ్య, సంతోష్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలి



నాగర్‌కర్నూల్‌రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బహుజన స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా నోడల్ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సంబర్భంగా బీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ మాట్లాడుతూ స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని కోరారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో నిరుపేద, మధ్యతరగతి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో బీఎస్ఎఫ్ నాయకులు చందు, బాలరాజు, వెంకట్, రాజు, పులేష్ తదితరులు పాల్గొన్నారు.

క్యాంపు కార్యాలయంలో ప్రత్యేక పూజలు



తాడూరు: జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం క్యాంపు కార్యాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సందమల్లయ్య, వెంకటయ్య, బాలస్వామి, రాములు, మల్లేష్ పాల్గొన్నారు.

నియామకపత్రాలు అందుకున్న స్టాఫ్ నర్సులు

అచ్చంపేట రూరల్: మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డు వలపట్లలో ఏడుగురు స్టాఫ్ నర్సు ఉద్యోగాలు సాధించారు. ఎంపికైన వారిలో స్వప్న, దీప్తి, సువేద, సంధ్య, జ్యోతి, మణెమ్మ, నిర్మలలు ఉన్నారు. హైదరాబాద్‌లో నియామక పత్రాలను సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ చేతుల మీదుగా అందుకున్నారు.

ఎన్ఎస్‌యూఐ నాయకుల హర్షం

అమ్రాబాద్: ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ బుధవారం శాసనమండలిలో ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా ఎన్ఎస్‌యూఐ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ యశ్వంత్ బుధవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.

లేబర్ సెలవుగా పాటించాలి

అచ్చంపేట: నియోజకవర్గంలో పనిచేస్తున్న మేస్త్రీలు, కూలీలు ప్రతి నెల1న లేబర్ సెలవు దినంగా విధిగా పాటించాలని నియోజకవర్గ భవన నిర్మాణ తాపి కార్మిక అధ్యక్షుడు మీనుగ ఖాజా కోరారు. అదే విధంగా అడ్డ కూలీలు, దినసరి కూలీలు తప్పకుండా లేబర్ గుర్తింపు కార్డు పొంది పనిలోకి రావాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

లింగాల: మండలంలోని మగ్దూంపూర్ దగ్గర ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో గురువారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు 4 గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిపివేస్తునట్లు ట్రాన్స్‌కో ఏఈ అప్పలనాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్‌లో మరమ్మతు చేస్తునట్లు పేర్కొన్నారు.

మైనర్ల అప్పగింత

కందనూలు: సికింద్రాబాద్‌లోని రామ్‌గోపాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇద్దరు మైనర్లు తప్పిపోయారు. వారు నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో అనుమానాస్పదంగా కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మైనర్ల వివరాలు సేకరించి బుధవారం రామ్‌గోపాల్ పోలీసులకు అప్పగించినట్లు ఎస్ఐ మహేందర్ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

వెల్దండ: మండలంలోని బైరాపూర్ వాగునుంచి గ్రామానికి చెందిన సత్యనారాయణ బుధవారం ఇసుకను అక్రమంగా తలిస్తున్నాడు. మంగళవారం రాత్రి బ్లూకోర్టు సిబ్బంది ట్రాక్టర్‌ను పట్టుకున్నారు. ఎలాంటి అనుమతి లేకపోవడంతో ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించి ట్రాక్టర్ యాజమానిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

సామాజిక సేవకు చేయూతనిస్తా

కల్వకుర్తి టౌన్: సామాజిక సేవకు చేయూతనిస్తానని కాంగ్రెస్ యువజన నాయకుడు ఆశాదీప్ రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని పీటీఎస్ వృద్ధాశ్రమాన్ని ఆయన సందర్శించారు. వృద్ధులకు సేవలు అందిస్తున్న నిర్వాహకుడు వెంకటయ్యను ఆశాదీప్‌రెడ్డి అభినందించారు. అనంతరం వృద్ధులకు పండ్లను ఆయన పంపిణీ చేశారు. అదేవిధంగా వృద్ధాశ్రమ నిర్వహణ కోసం రూ.50వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో ఆశాదీప్‌రెడ్డి సైన్యం నాయకులు సుదర్శన్, అశోక్, అనిల్, వృద్ధులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ భవనం ప్రారంభం



ప్రారంభిస్తున్న సర్పంచ్ పెద్ది రామకృష్ణ

వెల్దండ: మండలంలోని కంటోనిపల్లిలో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని సర్పంచ్ పెద్ది రామకృష్ణ, ఉప సర్పంచ్ సురేందర్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రూ.20లక్షల నిధులతో పంచాయతీ భవనాన్ని నిర్మించినట్లు పేర్కొన్నారు. సీసీరోడ్లు, అండర్ డ్రైయినేజీ తదితర పనులు చేపట్టినట్లు వివరించారు. ఐదేళ్లలో సర్పంచ్‌గా ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించామన్నారు. పదవిలో ఉన్న లేకున్న ప్రజలకు అందుబాటులో ఉంటామన్నారు. అనంతరం సర్పంచ్‌తో పాటు ఉపసర్పంచ్, వార్డు సభ్యులను శాలువాలతో ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో కార్యదర్శి ఫైయాజ్, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

సీఐగా మహేష్ బాధ్యతల స్వీకరణ



సీఐ మహేష్



బాధ్యతలు స్వీకరిస్తున్న వెల్దండ ఎస్ఐ రవికుమార్

కొల్లాపూర్: పట్టణ సీఐగా కే.మహేష్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. డీఎస్‌బీ సూర్యాపేట నుంచి ఆయన ఇటీవల కొల్లాపూర్‌కు బదిలీ అయ్యారు. ఈ మేరకు బుధవారం ఇక్కడ సీఐగా విధులు నిర్వర్తించిన యాలాద్రి నుంచి మహేష్ బాధ్యతలు స్వీకరించారు. సర్కిల్ పరిధిలో శాంతి, భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని ఆయన అన్నారు.

పెంట్లవెల్లి: మండలంలో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న సురేష్ వనపర్తి జిల్లా వీఆర్‌కు బదిలీ కాగా గతంలో వీపనగండ్లలో పనిచేస్తున్న ఎస్ఐ రామన్‌గౌడ్ మండల పోలీస్‌స్టేషన్‌కు బదిలీ అయ్యారు. ఈ మేరకు బుధవారం ఆయన బాధ్యతలు చేపట్టారు.

వెల్దండ: చారకొండ మండల ఎస్ఐగా విధులు నిర్వర్తిస్తున్న ఎస్ఐ రవికుమార్‌ను మండల ఎస్ఐగా బదిలీ అయ్యారు. ఈ మేరకు ఆయన ఎస్ఐగా బాధ్యతలు చేపట్టారు.

ఘనంగా గద్దర్ జయంతి

కల్వకుర్తిరూరల్: పట్టణంలోని టీఎస్‌యూటీఎఫ్ భవనంలో తెలంగాణ జానపద కళాకారుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం గద్దర్ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు రాములు హాజరై గద్దర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కృష్ణయ్య గౌడ్, విజయ్‌గౌడ్, బొజ్జన్న, వెంకటయ్య, శేఖర్ చౌహాన్, బాలస్వామి పాల్గొన్నారు.

అచ్చంపేట రూరల్: పట్టణంలో అంబేడ్కర్ యువజన సంఘం, గద్దర్ అభిమానుల సంఘం, ప్రజాసంఘాలు, వివిధ రాజకీయ నాయకుల ఆధ్వర్యంలో పట్టణంలోని తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద గద్దర్ చిత్రపటం ఉంచి ఘన నివాళులర్పించారు. నాయకులు శ్రీశైలం, నాసరయ్య, రామనాథం, బాలకిష్టయ్య, భీమయ్య, మాణిక్‌బాబు, పాండు, మహబూబ్‌అలీ పాల్గొన్నారు.

అమ్రాబాద్: మండల కేంద్రంలోని అంబేడ్కర్‌చౌరస్తాలో దళితసంఘాల ఆధ్వర్యంలో ప్రజాయుద్ధనౌక, గాయకుడు గద్దర్ జయంతిని నిర్వహించారు. గద్దర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.



అచ్చంపేటలో నివాళులర్పిస్తున్న నాయకులు



కల్వకుర్తిలో